# చేజారిన వసంతం

**యస్.యస్. శర్మ**

"ఎక్స్‌క్యూజ్ మి

బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' పుస్తకం చదువుతున్నవాణ్ణి, పిలుపు వినిపించిన వైపు చూశాను గుమ్మంలో నిలబడి ఉన్నదామె రండి కూర్చోండి అంటూ లోనికి ఆహ్వానించాను

ఆమె పేరు మాధవి సుమారు ముప్ఫై ఐదు సంవత్సరాల వయసుఉంటుంది ఎర్రటి రంగుతో, చాలా నాజూకుగా ఉంది. చూసేవారిని ఎంతో ఆకర్షింప జేస్తూ, అందగత్తెల జాబితాలో చేర్చతగినది ఏదో ప్రయివేటు కంపెనీలో పని చేస్తూ, ఐదారు వందలు సంపాదించుకుంటోంది తన ఇద్దరు కొడుకులతో మా ప్రక్క వాటాలో అద్దెకుంటుంది ఆమెకు పుస్తకాలు ఎక్కువగా చదివే అలవాటుందని తెలిసి, నేను వ్రాసిన కొన్ని కథలు ఇచ్చి, అభిప్రాయం చెప్పమన్నాను

చదివారా? ఎలా ఉన్నాయి? ఆమె అందించిన కథలు తిరిగి తీసుకుంటూ అడిగాను

. మీరు మరోలా అనుకోనంటే నా అభిప్రాయం చెప్తాను అందులో నాకే కథా నచ్చలేదు నిర్మొహమాటంగా చెప్పింది

నా మనస్సు చివుక్కు మన్నది సహజంగా ఏ రచయిత అయినా పాఠకుల నుండి తన కథకు ఖచ్చితమైన అభిప్రాయాన్నే కోరతాడు కథ ఏమీ బాగోలేదనే అభిప్రాయాన్ని నిండు మనసుతో స్వీకరించలేడు నేనూ అలాగే ఫీలయ్యాను

అందులో మీకు నచ్చనివి ఏమిటో చెప్పండి సబబు అనిపిస్తే మరోసారి తప్పక జాగ్రత్త పడతాను సిన్సియర్‌గానే అన్నానేను

నాకు మొహమాటం లేకుండా మాట్లాడటం అలవాటు దయచేసి మీరేమీ అనుకోవద్దు మీ కథ నడిపే తీరు పాత్రల ఔచిత్యం ఎందుకో మరినాకు నచ్చలేదు నిజం చెప్పాలంటే నాకు సుధీర్‌గారి రచనలు తప్ప మరేవీ నచ్చవు అంది

ఆయన దంతా ఓ సి నాటి పద్ధతి మారే కాలంతో పాటు మనమూ మారాలి అలాగే రచనలలో కూడ ఇన్ని రకాల మార్పులొస్తుండగా ఆయన తన పాత పద్ధతిలోనే వ్రాస్తారు మీరూ ఆ చెత్త రచనలు ఇష్టపడతారంటే ఆశ్చర్యంగా ఉంది అన్నాను అవకాశం దొరికింది కదా అని ఆమె అభిమానం మీద దెబ్బ తీశాను

దయచేసి నాముందు ఆయన్ను గాని ఆయన రచనలను గానీ ఏమీ అనకండి నేను భరించలేను అనేసి విసవిసా వెళ్ళి పోయింది

నాకూ సుధీర్ గారి రచనలపట్ల మంచి అభిప్రాయమే ఉంది కేవలం ఆమె అభిమానాన్ని దెబ్బతీయాలని అలా మాట్లాడాను ఆమె సుధీర్ అభిమాని కాదు దురభిమాని తెండిగడవటం కష్టంగా ఉన్నా ఆయన పుస్తకాలు కొని మరీ చదువుతుంది ఆమె ఒక విచిత్రమైన మనిషి ఆమెతో పరిచయం కాక ముందు, ఒక రోజు బోర్ కొడుతుంటే ప్రొద్దున్నే మా ఫ్రెండ్ పుస్తకాల షాపు కెళ్ళి కూర్చున్నాను అక్కడకు వచ్చిందామె

సుధీర్ గారి సుడి గుండాలు నవల వచ్చిందాండీ అని అడిగింది

లేదండీ ఇంకారాలేదు

ఈరోజు వస్తుందన్నారుగా అన్నది

అవునండీ ఈరోజు రిలీజ్ చేస్తామన్నారు బహుశా సాయంత్రం వరకు రావచ్చు వస్తే ఇస్తాను సాయంత్రం రండి అన్నాడు

ఒక వేళ వస్తే ఒక కాపీ తీసి ఉంచండి అంటూ డబ్బుకట్టి వెళ్ళింది

మాషాపుకు ఎంతో మంది వస్తుంటారు కదా ఈమెలాగా పుస్తకాల పిచ్చి ఉన్న వాళ్ళను నేనెవరినీ చూడలేదురా సుధీర్ గారి పుస్తకం వస్తోందంటే ఇలా డబ్బుముందే కట్టి వెళుతూ ఉంటుంది అన్నాడు నాతో మావాడు నవ్వుతూ

మనిషి కొక పిచ్చి మహిలో సుమతీ అని ఊరికే అనలేదు సినిమా హీరోలకీ క్రికెట్ ఆటగాళ్ళకు అభిమానులున్నట్లే రచయితలకు కూడ ఇలాంటి వాళ్ళు ఉంటారు అన్నానేను కొంతసేపు కూర్చుని వచ్చేశాను

ఆరోజు రాత్రి భోంచేసి అరుగు మీద సిగరెట్ కాల్చుకుంటూ కూర్చున్నాను వాళ్ళ వాటాలో నుండి మాటలు వినబడుతున్నాయి తల్లీ కొడుకులు మాట్లాడు కొంటున్నట్లున్నారు

అమ్మా, స్కూలు ఫీజు కట్టటానికి రేపే లాస్ట్ డేట్

ఇప్పుడు డబ్బుల్లేవురా లేట్ ఫీజుతో కడుదువు గానిలే

లేట్ ఫీజుతోనే రేపు లాస్ట్ డేటమ్మా ఇంతకుముంధు అడిగినప్పుడూ ఇలాగే అన్నావు మా హెడ్మాష్టరు పిలిచి మరీ చెప్పారు ఫీజు కట్టకుండా రేపు స్కూలుకు రావద్దని అన్నాడు

అబ్బ! నన్ను విసిగించకు చదువుకుంటుంటే మధ్య నీదో గోల అంతగా స్కూలుకు రానియ్యక పోతే మానేసెయ్ పో అవతలికి వెళ్ళు అని కసిరింది

ఇప్పుడా బోడి పుస్తకం కొనుక్కు రాక పోతే ఏం పోయేది? ఆడబ్బులతో నాకు ఫీజు కట్టవచ్చుగా నేనెప్పుడు పుస్తకాలకడిగినా, ఫీజుల కడిగినా లేవంటావు కానీ నీకు నవలలు కొనుక్కోవటానికి మాత్రం ఉంటాయి ఏడుస్తూనే అడిగాడు

నోర్ముయ్ వెధవా! వేలెడు లేవు నువ్వు నన్ను అడిగే వాడివా? పైగా సుధీర్ గారి పుస్తకాన్ని బోడిపుస్తకం అంటావా? అంటూ ఒక్కటి పీకింది

ఇంకా ఎక్కువగా వాగావంటే వీపు చిట్లుతుంది నా అలవాట్లను ప్రశ్నించ వద్దని లోగడ నీకు చాలా సార్లు చెప్పాను అయినా ఫీజు కోసం నేను చాలా చోట్ల అప్పు అడిగాను ఎక్కడా దొరకలేదు రేపు నేను వచ్చి మాట్లాడతాను అంతగా స్కూలుకు రానియ్యక పోతే వచ్చే సంవత్సరం చదువుదువు గాని పోయి పడుకో అని కోప్పడింది

ఆ సంభాషణ విని నేను అవాక్కయ్యాను పిల్లల ఫీజు కట్టటానికి లేకపోయినా అడ్వాన్సు డబ్బిచ్చి మరీ పుస్తకాలు కొనుక్కొనే ఆమె దురభిమానానికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు మర్నాడు వాళ్ళబ్బాయిని పిలిచి అడిగాను

రవీ, రాత్రి మీ అమ్మగారెందుకు కేకలేస్తున్నారు?

స్కూలు ఫీజుకు డబ్బడిగితే లేవంది అన్నాడు నెమ్మదిగా తలవంచుకొని

ఇంటి విషయాలు నాలాంటి పరాయి వాళ్ళకు చెప్పటానికి ఇష్టపడని అతని మనస్తత్వం వినయం, పొందిక చూసి నాకు ముచ్చటేసింది

రవీ, నీకు అభ్యంతరం లేకపోతే, నీ ఫీజుకు నేను డబ్బులిస్తాను అన్నాను

థాంక్సంకుల్ అమ్మ నడిగి వస్తాను అంటూ లోనికి పరుగెత్తి కెళ్ళి వచ్చాడు అతని వెనకాలే ఆమె కూడ వచ్చింది

మిమ్మల్ని ఎవరడిగారని సహాయం చేస్తున్నారట? అన్నది కొంచెం కోపంగానే

క్షమించండి రాత్రి అరుగు మీద కూర్చుంటే మీ సంభాషణ విన్పించింది పిల్లవాడి కెరియర్ దెబ్బతింటుందని నేను ఇస్తానన్నాను ఊరికే సహాయం చేసే స్తోమత నాకూలేదు మీకు డబ్బురాగానే ఇచ్చేయండి ఆ తర్వాత మీ యిష్టం కొంత నిష్ఠూరం ధ్వనించే టట్లుగా అన్నాను

చాల థాంక్సండీ పరిచయం లేని వాళ్ళ వద్ద అప్పు తీసుకోవటం నాకిష్టముండదు అందుకే అలా కటువుగా మాట్లాడాను ఏమీ అనుకోవద్దు రేపు పస్టుకు తిరిగి ఇచ్చేస్తాను' అన్నది

అలాగే మీ ఇష్టం అంటూ పర్సుతీసి డబ్బు ఇచ్చాను తీసుకొని వెళ్ళబోతూ తిరిగి అన్నది

రాత్రి మా అబ్బాయి మీద చెయ్యి చేసుకోవటం తెలిసి బహుశ మీరు నన్ను రాక్షసి అనుకోవచ్చు నాకు సుధీర్ గారంటే ఆరాధనాభావం ఆయనను గాని ఆయన పుస్తకాలను గాని, ఏమైనా అంటే భరించలేను అందుకే అలా ప్రవర్తించాను అని వెళ్ళి పోయింది

అలా మా మధ్య పరిచయం ఏర్పడి క్రమంగా పెరిగింది ఆమె పరిచయంలో, ఎన్నో ఎదురు దెబ్బలు తిన్న మనిషి అనిపించింది తన సంసారాన్ని చాల గుట్టుగా నడుపుకుంటుంది. ఆమె కాళీ చిక్కినప్పుడల్లా ఏవో పుస్తకాలు చదువు తుంటుంది. అందుకే నా కథలు ఇచ్చి అభిప్రాయం చెప్పమన్నాను అలా సూటిగా చెబుతుందని ఊహించలేదు

నా పాత ఆలోచనల నుండి వర్తమానంలోకి వచ్చి, మిగిలిపోయిన "చివరకు మిగిలేది" పూర్తి చేసి నిద్ర పోయాను

★ ★ ★ ★ ★

ఒకరోజు కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాము నేనూ, ఆవిడ

"మాధవి గారూ, నేనొక థీమ్ చెబుతాను దాని ఎండింగ్ ఎలా ఉంటే బాగుంటుందో చెప్తారా?" అన్నాను

ఆమె నిరాసక్తంగా నవ్వి 'ఏదైనా క్రొత్త కథా? చెప్పండి" అన్నది

"ఒక పెళ్ళయిన నిరుద్యోగి ఉద్యోగం కోసం చాలా పాట్లు పడి, చివరకు తన మామ గారి సహాయంతో, విదేశంలో ఒక ఉద్యోగం సంపాదిస్తాడు అక్కడ అనుకోని, తప్పనిసరి, పరిస్థితులలో మరొకామెను పెళ్ళి చేసుకోవాల్సివస్తుంది ఇద్దరు భార్యల మధ్య చాలా అవస్థలు పడుతుంటాడు అలా కొంత కాలం గడుస్తుంది చివరకు ఇద్దరు భార్యల్లో ఒకరిని చంపేసి కథ ముగించాలి"- ఎవరిని తొలగిస్తే బాగుంటుందో చెప్పండి" అన్నాను

నాకు అసలు ఆ ప్లాటే నచ్చలేదు" అన్నది రవ్వీమని తడుముకోకుండా

నేను కథ చెప్పినంత సేపు పట్టలేదు ఆమె అభిప్రాయం వినేందుకు అవున్లెండి మీ దృష్టిలో కేవలం సుధీర్ గారే రచయిత మిగిలిన వాళ్ళెవరూ రచనలు చేసేందుకు అర్హులు కారు' అన్నాను నిష్ఠూరంగా

ఇందులో ఆయన ప్రస్తావన అనవసరం అయినా వచ్చింది కాబట్టి చెబుతున్నాను ఇలాంటి అర్థం లేని ఆలోచనలతో ఆయనెప్పుడూ వ్రాయరు'అన్నది

మీరు ఆయన అభిమానులు, గనుక అలా అంటున్నారు కానీ ఆయన నవలల్లో కథల్లో, పేజీకొక తలనెప్పి మాత్ర ఖర్చు అయ్యేవి చాలా ఉన్నాయి అన్నాను

వెంటనే ఆమె ముఖంలో రంగులు మారిపోయాయి చాలాచిన్న బుచ్చుకున్నది ముఖమంతా ఎర్రగా మారిపోయి, ముక్కు పుటాలు అదురు తుండగా అన్నది "జీవితం అనే ఆటలో మగవాడు ఆడదాని మనసుతో ఆడుకుంటూనే ఉన్నాడు ఆమె బ్రతుకు చివరకు హత్య, ఆత్మహత్యలతో నే ముగుస్తుంది స్త్రీని ఉన్నతంగా చూసే సమాజం కుళ్ళి పోయి చాలా కాలమైంది అట్లాంటి సమాజంలో స్త్రీకి అంతకన్నా విలువెక్కడుంది లెండి? అందులో మీలాంటి వాళ్ళ వల్ల మరీనూ'

"అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ. నేను మిమ్మల్నేమి అన్నానండీ?" గాబరాగా అడిగాను ఆమె ఆవేశం చూసి ఆమెకు కోపమొచ్చిందేమో నని భయంగా నేనేమి తప్పుగా మాట్లాడానో నాకే అర్థం కాలేదు

"నేను మాట్లాడేది మీరు చెప్పిన కథ గురించి అందులో మగవాణ్ణి నమ్ముకున్న ఇద్దరు స్త్రీలను సృష్టించి, చివరకు ఒక పాత్రను చంపి ఆనందిస్తారు. అలాంటి స్థితి కల్పించిన మగవాడికి బానిసగా మీరు రచనలలో కూడ స్త్రీని రచ్చకీడ్చి హింసించి ఆనందిస్తారు రచయితగా" అని కొంత సేపు ఆగి ఆవేశం కొంత తగ్గించుకొని "సారీ నాకు మీ పై ప్రత్యేక మైన కోపం లేదు. నాకోపమంతా మీ జాతిపైన. మీరు నా అభిప్రాయం అడిగారు కదా కథలో హీరో పాత్రను చంపెయ్యండి పీడా పోతుంది" అనేసి గబగబా లోనికి వెళ్ళి పోయింది

ఆమె ఆవేశం వెనుకగల కారణాలేమిటా అని ఆమె గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను నాకథలు, ఆలోచనలు చాలా మందికి నచ్చుతాయి కేవలం ఈమె ఒక్కతే చెప్పుచ్చుకు కొట్టినట్లు నచ్చలేదని చెబుతూ ఉంటుంది. ఇలాంటి సంఘటనలు మామధ్య నాలుగైదు సార్లు జరిగాయి ప్రతిసారీ ఇలాగే సమాధానం చెబుతుంది నాకు వళ్ళు మండి సుధీర్‌ను ఒక మాట అంటాను సీరియస్‌గా కోపమొచ్చి వెళ్ళిపోతూ ఉంటుంది ఇలా హద్దులేని దురభిమానం అనర్థదాయకమని ఆమె తెలుసుకుంటే బాగుంటుందని పించింది


★ ★ ★ ★ ★

ఆరోజు త్యాగరాయ 'గానసభలో సుధీర్ గారికి సన్మానం ఆమెకోసం నేనొక పాస్ తెచ్చాను ఆమె బలవంతాన నేను కూడ వెళ్ళటం జరిగింది

'నమస్కారమండీ, బాగున్నారా? అంటూ నన్ను పలకరించారు శాంతగారు

ఆc, నమస్కారమండీ, మీరెలా ఉన్నారు?' అన్నాన్నేను

అలా కుశల ప్రశ్నలు ముగిశాక, దూరంగా ఉన్న మాధవి గారిని పిలిచి 'వీరెవరో తెలుసా మీ అభిమాన రచయిత సుధీర్ గారి భార్య , అంటూ ఆమెకూ ఈమె మీ వారి అత్యంత అభిమాని" అంటూ శాంత గారికి పరిచయం చేశాను కాశ్మీర్ జరీ





చీరకట్టి, తలనిండా పూలతో నిండుగా, గాంభీర్యంగా, కన్పించే ఆమె వంక ఒకనిముషం అలాగే రెప్ప వాల్చకుండా చూస్తూ నిల పోయింది మాధవి. ప్రోగ్రాం మొదలవటానికి ఇంకా టైమ్ ఉండటంతో మేం ముగ్గురం ఒక ప్రక్క కూర్చొని మాటల్లో పడ్డాం. కొంతసేపు పిచ్చాపాటీ ముగిశాక, వాళ్ళిద్దరూ నన్ను వెలివేసి వాళ్ళే మాట్లాడుకుంటున్నారు.

"మీ వారి రచనలు మీరూ చదువుతారా?" అని అడిగింది మాధవి.

"చదవటమా, భలేవారేనే ఆ కథలన్నీ ఫెయిర్ వ్రాసేదేనేను. ప్రతి ప్లాటూ నాతో చర్చించకుండా మావారు వ్రాయనే వ్రాయరు" అన్నది.

"మరి మిగిలిన టైములో ఏం చేస్తుంటారు" అన్నది మాధవి.

"ఇంటి పని అయిన తర్వాత మా వారి కథలు ఫెయిర్ కాపీ వ్రాయటం, పత్రికలకుపంపటం, ఏయే కథలు ఏయే పత్రికల్లో ఉన్నాయో చూసుకోవటం, వాటి రికార్డు, అంతా నేనే చూస్తాను. ఈ పనులు చేయటానికి నాకు రోజుకు ఇరవై నాల్గు గంటలూ చాలక మరో నాల్గు గంటలుంటే బావుణ్ణని పిస్తుంది".

"అంతసేపూ పుస్తకాల్లో గడపటానికి బోర్ ఫీలవ్వరా?" అన్నది. మాధవి ప్రతి ప్రశ్నలోనూ ఏదో ఆతృత ఆమెను గురించి పూర్తిగా తెలుసుకోవాలన్న తపన సులువుగా గ్రహించింది సుధీర్ భార్య. నా ఆవిడ ఆతృత లేని ఉత్సాహాన్ని రేకెత్తించింది.

"నాకేం బోర్ వెయ్యలేదండీ. పైగా చాలా ఆనందంగా కూడ ఉంటుంది. నేను ఆయన్ని కావాలని పెళ్ళి చేసుకొన్నదే అందు కోసం. ఆయన వ్రాసే ప్రతి కథ తొలి కాపీ నేనే చదువుతున్నందుకు గొప్ప థ్రిల్ ఫీలవుతాను. భర్త ప్రతి విజయం వెనుక తనుండి, అతనికి ప్రతి పనిలోనూ సాయంపడటంకన్నా ఏ ఆడదైనా ఏం

# చేజారిన వసంతం

కోరుకుంటుంది చెప్పండి. రోజంతా ఎండలో ఉండి చెప్పులు కుట్టుకునేవాడి భార్య, తాను. కూడ ఎండలో ఉండి ఆ చెప్పులకు మేకులు కొట్టటం వంటి సహాయం చెయ్యటంలేదా?, టైలర్ భార్య అతను కుట్టిన బట్టలకు గుండీలు కుట్టి తోడ్పడటంలేదా? అలాగే రచయిత భార్యగా నేనూ ఈ పనులన్నీ చెయ్యటానికి బోర్ ఎలా కలుగుతుంది. ఆనందంతో అది నా విధిగా భావిస్తాను". గొప్ప రచయిత భార్యగా ఆ దర్పం, ప్రతి మాటలోనూ ప్రస్ఫుటమవుతూంది.

ఇంతలో కార్యక్రమం ప్రారంభం కావటంతో మా వద్ద శెలవు తీసుకుని హుందాగానడుచుకుంటూ వెళ్ళిపోయింది సుధీర్ భార్య.

మాధవి ఉన్నట్టుండి "నేను వెళతాను. కొంచెం పనుంది. మీరుప్రోగ్రాం చూసి రండి" అన్నది నాతో సుధీర్ భార్యతో మాట్లాడుతున్నంత సేపు ఆమె ముఖంలో మార్పులు నేను గ్రహించకపోలేదు. అయినా అడిగాను.

"అదేమిటండీ. మీరుండరా? సుధీర్‌గార్ని ఒక మాట పడనీయరు. ఆయన వ్రాసిన రచనలను భగవద్గీత కన్న ఎక్కువగా పూజిస్తారు. పట్టు బట్టి మరీ నన్ను లాక్కొచ్చారు. అట్లాంటి మీరే ఆయన సన్మానం చూడకుండా వెళతా నంటున్నారు, నమ్మశక్యం కాకుండా ఉంది. ఏమయింది మీకు" అన్నాను. నిజంగానే ఎంతో ఆశ్చర్యంగా.

"అబ్బే, ఏమీ లేదండి. కొంచెం అర్జెంటు పనుంది అంతే. అయామ్ సారీ" అనేసి మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే గబగబా వెళ్ళిపోయింది.

ఆమె అలా ప్రవర్తించటానికి గల కారణం తెలుసుకోవాలనే కుతూహలం నన్నక్కడ నిలువనీయలేదు. నేను కూడ ఆమె వెనకే బయలుదేరాను.

ఆమె పరుగులాంటి నడకతో ఇంటికి చేరి, మంచంమీద బోర్లాపడి, దిండులో ముఖం దాచి, వెక్కి, వెక్కి ఏడుస్తోంది. "మాధవిగారూ" అంటూ మూడు నాలుగుసార్లు పిలిచాను. పలకలేదు. ప్రతి మనిషి జీవితంలోనూ కొన్ని చేదు అనుభవాలు ఎన్నాళ్ళయినా వెంబడిస్తూనే ఉంటాయి. కొన్నాళ్ళ కొరకైనా వాటిని దూరం చేసుకోవాలంటే కొంత కన్నీరు వృథా కాక తప్పదు. అందులోనూ ఆడవాళ్ళకు మరీను. అలాంటి సంఘటన ఏదో గుర్తుకు వచ్చి ఉంటుందనిపించింది. కొంతసేపు ఆమెను కదల్చదలచుకోలేదు. అక్కడే ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాను.

ఒక గంట తర్వాత ఆమె కొంచెం తెప్పరిల్లి, లేచి వచ్చింది. ఏడ్చి, ఏడ్చి ముఖం బాగా ఉబ్బి ఉన్నది. కళ్ళు ఎర్రబడ్డాయి. మా రూంలోకి వెళ్ళి, టీ పట్టుకొచ్చి, బలవంతాన ఆమె చేత ఒక కప్పు త్రాగించాను.

"ఏమైంది? అలా ఉన్న పళాన వచ్చేశారు?" అని అడిగాను.

ఒక్క నిముషం మౌనంగా ఉండి, తల దించుకుని చెప్పింది. "ఏమీ లేదు. మనసు బాగుండక అక్కడ ఉండలేక పోయాను". ఆమెను గురించి తెలుసుకోవటానికి అదే సమయమనిపించింది.

"మాధవిగారూ, కష్టాలూ, బాధలూ ప్రతి జీవితంలోనూ ఉంటాయి. కాకపోతే కొంచెం హెచ్చు, తగ్గులు తప్ప. వాటిని ఇతరులకు పంచక పోయినా, కనీసం చెప్పుకోవటం వల్లనైనా మనసుకు కొంత స్వాంతన చిక్కుతుంది. మీ జీవితంలో ఏదో విషాద ముందని తెలుసు గానీ, సందర్భం రాక ఇన్నాళ్ళూ అవేమిటో తెలుసుకోలేక పోయాను. ఇన్నాళ్ళ మన పరిచయంలో నన్ను మీరు ఆత్మీయుడుగా భావిస్తే, మీకు సంతోషాన్ని దూరం చేసిన ఆ గతాన్ని నాకు చెప్పండి" అంటూ అనునయించాను.

నా మాటలకు ఆమె కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. "సరే చెప్తాను. నా గత చరిత్ర తెలిస్తే మీరు నన్ను అసహ్యించుకుంటారని తెలిసినా, చెప్పుకోవటానికి సిగ్గుగా వున్నా, మనసుకు కొంత ఊరట కల్గుతుందేమోనన్న ఆశతో చెప్తాను" అంటూ ప్రారంభించింది.

"నేనొక సాంప్రదాయకమయిన సామాన్య కుటుంబంలో పుట్టాను. అందరి ఆడపిల్లల్లాగానే రకరకాల రంగుల కలలు కన్నాను. నాకు చిన్నప్పటి నుంచీ హై క్లాస్ జీవితం అంటే మక్కువ ఎక్కువ. పెళ్ళయినాక భర్త ఆఫీసు నుండి రాగానే, నన్ను షికార్లకు, సినిమాలకు తీసుకెళ్ళాలనీ, ఆఫీసు టైం తప్ప మిగిలిన టైం అంతా నాతోనే గడపాలనీ, రకరకాల ఊహల్లో విహరించేదాన్ని. కలలూ, వాస్తవాలూ రైలు పట్టాల్లాంటివని, గ్రహించలేని వయసది. సాంప్రదాయకంగానే, కట్న కానులతో నా పెళ్ళి జరిగింది. మా వారు విజయవాడలో ఎలక్ట్రిసిటీ ఆఫీసులో యల్. డి. సి. పైపెచ్చు మావారికి రచనలు చెయ్యాలనే కోరిక విపరీతంగా ఉండేది. రచయితగా స్థిరపడటం ఆయన జీవిత


కూపన్
ఆంధ్ర సచిత్ర వార పత్రిక

చింతలూరు ఆయుర్వేద ఫార్మశీ వారి
వైద్య సలహాలు

ప్రశ్న: ........................................

........................................

పంపినవారి పేరు: ........................................

పూర్తి చిరునామా: ........................................

........................................

లక్ష్యం అనేవారు. పగలంతా ఆఫీసులో పని, సాయంత్రం కాగానే కాగితాల దొంతరలు ముందేసుకని ఏవేవో వ్రాస్తూ ఉండేవారు. ఆదివారం వచ్చిందంటే ఈ కార్యక్రమం ఉదయం నుంచే ప్రారంభమయ్యేది. ఆయన వ్రాసిన ఏ కథా ప్రింటయ్యేది కాదు. రోజూ యింటినిండా బుట్టెడు చెత్త మాత్రం పోగయ్యేది. నన్నెక్కడికీ బయటకు తీసుకెళ్ళేవారు కారు. నగలూ, నట్రా లేకపోయినా, రోజూ ప్రేమతో మూరెడు పూలైనా భర్త తెస్తే, ఏ భార్య అయినా ఎంతో సంతోషిస్తుంది. రచయిత అయినా ఆయన ఆమాత్రం గ్రహించలేక పోయేవారు. నా కలల సౌధాలన్నీ కూలిపోవటానికి ఎంతో కాలం పట్టలేదు".

"ఆయనకు నచ్చజెప్పి చూడకపోయారా?" మధ్యలో నే ప్రశ్నించాను.

"ఎన్నోరకాలుగా ప్రయత్నం చేశాను. ముందుగా నేనసలు ఆయన బడ్జెట్ జీవితంలో సర్దుబాటు కాలేకపోయాను. ఆయన జీతమంతా నా చేతికిచ్చేవారు. ఎలా ఖర్చు పెట్టినా, నొప్పించేటట్లు ఒక్క మాట కూడా అనేవారు కారు. ఆయన కథలు చదివి అభిప్రాయం చెప్పమనేవారు. నన్నెక్కడికీ తీసుకెళ్ళరన్న కసితో అన్ని కథలూ బాగోలేదనే చెప్పేదాన్ని. ఆయన్ని ఎంతో డిస్కరేజ్ చేసేదాన్ని. సరిగ్గా శాంతగారు తన భర్త పట్ల ప్రవర్తించేతీరుకు భిన్నంగా ప్రవర్తించేదాన్ని. నా కోరికల విషయంలో నే గాక, శారీరక వాంఛలలో కూడ నేనాయనతో సర్దుబాటు కాలేకపోయాను".

"అలాటి పరిస్థితులలో నా దురదృష్టవశాత్తూ, ఆయన స్నేహితునితో పరిచయం అయింది. అతను రోజూ మా యింటికి వచ్చి, రోజల్లా అక్కడే గడిపేవాడు. మావారు ఏదైనా వ్రాసుకుంటూంటే మేం ఇద్దరం చెస్ ఆడుకునేవాళ్ళం. మేం ముగ్గురం ఆదివారాలు అమరావతి, కొండపల్లి వెళుతూ ఉండేవాళ్ళం. నా బలవంతం మీద వచ్చినా మావారు ఏదో ఆలోచిస్తూ కూర్చునేవారే గాని మాతో సరదాగా గడిపేవారు కారు. మా భార్యాభర్తల మధ్యనున్న మానసిక దూరాన్ని, వారి స్నేహితుడు పసికట్టటానికి ఎక్కువ కాలం పట్టలేదు. క్రమంగా అతను నాలోని బలహీనతల్ని గుర్తించి, ఎక్స్ప్లాయిట్ చేశాడు. రకరకాల ఫారిన్ సెంట్లు, చీరల్లు, నాకు బహుమతులుగా ఇచ్చేవాడు. వీలైనప్పుడల్లా నా అందాన్ని రకరకాల ఉపమానాలతో, పొగిడేవాడు. మొదట్లో అతని మాటలూ, చేష్టలూ నాకు వెగటనిపించినా నాలో క్రమంగా నిద్రాణమయిపోతున్న కోరికల మీద బాణాలుగా పనిచేశాయి. కోరికలు మరల పురివిప్పటంతో నా మనసు అటువేపే మళ్ళింది. మావారు ఉండీ వంటరిగా ఫీలవుతున్న నేను అతనికి దగ్గరయ్యాను. జీవితాన్ని పూల పాన్పుగా మలచుకోవాలనీ, సుఖప్రదం చేసుకోవాలనీ, మనసుకు నచ్చినట్లు ప్రవర్తిస్తే తప్పు కాదనీ, రకరకాల మాటలతో నా మనసు నింపేశాడు"

నాలో కోరికలూ, మనసూ, బంధాలూ, కట్టుబాట్ల మధ్య విపరీతమయిన సంఘర్షణ ప్రారంభమైంది. నా మనసే తప్పు అని మందలిస్తోంది. అదే మనసు తప్పు చెయ్యమని ప్రబోధిస్తోంది" అంటూ కొద్దిసేపు ఆపి ధారాళంగా కారుతున్న కన్నీరు తుడుచుకుంది.

"తర్వాత ఏమైంది?" ఎంతో ఆతృత్తో అడిగాను.

"ఏమవుతుంది? మితిమీరిన కోరికలు అన్నింటినీ జయించాయి. అమాయకుడైన, దేముడులాంటి భర్తకు ద్రోహం చెయ్యమనే ప్రేరేపించాయి. ఆ సమయంలో శని దేవత పూనిందో అజ్ఞానంలో, చక్కటి సంసారాన్ని నాశనం చేసుకుని, నా వాళ్ళందరినీ అపకీర్తిపాలు చేసి, అతనితో బొంబాయి వెళ్ళిపోయాను. కాదు కాదు, లేచిపోయాను. కొన్నాళ్ళకు మా మోజుల ప్రతిబింబాలుగా ఇద్దరు పిల్లలు పుట్టారు. రకరకాల తేనెలు త్రాగి జీవితం వెళ్ళబుచ్చే తుమ్మెద ఒకే పువ్వును అంటిపెట్టుకుని ఎందుకుంటుంది? అది గ్రహించలేని పువ్వు అమాయకంగాతమ బంధం శాశ్వతమనుకొంటుంది. అతనికి నేను వాసనలు కోల్పోయి, వాడిపోయిన పువ్వులాగా కన్పించటంతో అకారణంగా గొడవ పెట్టుకొని నన్నొదిలి వెళ్ళిపోయాడు మరొక పువ్వుకోసం. అతడు నాకు చేసిన మేలల్లా నన్ను ఏ వ్యభిచార గృహానికో అమ్మకుండా వదిలివేయటం. సినిమాల్లో చూపించే దెబ్బతిన్న ప్రతి ఆడపిల్లలాగానే ఆత్మహత్య చేసుకుందామనుకుని, ఈ పిల్లల కోసం జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. వయసు తొందరలో అంతులేని మితిమీరిన వాంఛల కోసం, జీవితాన్ని నాశనం చేసుకున్న నాలాంటి వాళ్ళు చావకుండా బ్రతికి ఉండటమే పెద్ద శిక్ష. ఉన్నంత కాలం చేసిన తప్పు వేటాడి వేధిస్తూనే ఉంటుంది. అలా పశ్చాత్తాపంతో బ్రతుకుతూ నా మూలంగా అప్రతిష్ఠపాలైన మావారిపై ఆరాధనతో, ఆయన కిష్టమైన ప్రతిదీ, నా యిష్టంగా మలచుకుంటూ, బ్రతుకుతున్నాను. అదీ నా వెనుక కథ" అని ముగించి, కళ్ళు తుడుకుంది.

"ఇంతకీ మీ భర్త తర్వాత అయినా పేరుప్రఖ్యాతులు సాధించారా? ఎవరాయన?" అని అడిగాను అనుమాన నివృత్తి కోసం.

"ఎంత అమాయకులండీ! రచయిత అయి కూడా గ్రహించ లేకపోయారు. సుధీర్‌గారిని మోసంచేసిన మొదటి భార్యను నేనే" అంటూ లేచి ఏడుస్తూ, పరుగెత్తుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

"మీ కథ తెలుసుకుని ఏ ఆడపిల్ల అయినా కోరికల ఊబిలో పడకుండా ఉండేటట్లు చెయ్యగలిగితే చాలు" అనుకున్నాను. నాలోని రచయిత అందుకు రంగమంతా సిద్ధం చేసుకున్నాడు. □

# ఫ్రిజ్‌లో కూరలు ఎలా నిలవ ఉంచాలి?

ఈ రోజుల్లో ఫ్రిజ్ లగ్జరీ ఐటమ్ కానేకాదు. గృహిణికి చాలా ఉపయోగకరమైన వస్తువు. ఈ బిజీ యుగంలో అన్ని పనులు ఒకేసారి చేసుకోవాలంటే చాలా కష్టం. తీరికవేళలో చేసుకుంటే తప్ప ఉదయానికి అమరవు. అందుకే వారానికి సరిపడా కూరలు ఒకేసారి తెచ్చుకుని చక్కగా శుభ్రపరిచి ఫ్రిజ్‌లో ఉంచితే వారమంతా నిశ్చింతగా వుండొచ్చు.

పచ్చి కూరలు ఫ్రిజ్‌లో వుంచేముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే కూరలు పాడవటంకానీ, కుళ్ళిపోవటంకానీ జరగవచ్చు. కూరగాయలు వారమంతా తాజాగా వుండాలంటే తెచ్చిన వెంటనే శుభ్రంగా కడిగి నీళ్ళు కారిపోయే వరకు బయటవుంచి తర్వాత వెజిటబుల్ ట్రేలో వుంచాలి. లేకపోతే ట్రేలో నీళ్ళు చేరి కూరలు క్రమంగా కుళ్ళిపోతాయి.

శాకరం కోసం కూరలు తరుక్కుని వేరువేరు పాలిథిన్ కవర్లలో పెట్టి రబ్బరు బేండ్సుతో సంచి మూసెయ్యాలి. ఇలాచేస్తే వారం రోజులైనా కూరలు పాడుకావు. ఇలానే ఆకు కూరలు ఉంచవచ్చు. అయితే ఆకు కూరలోని అనవసరమైన చెత్తను తీసెయ్యాలి. కూర ఆకారం పెద్దదిగా వుంటే ముక్కలు చెయ్యొచ్చు. శుభ్రంచేసిన తర్వాత నీళ్ళులేకుండా చూసి ప్లాస్టిక్ కవర్లో పెట్టి రబ్బరు బేండ్ వెయ్యాలి. ఏమాత్రం నీరు వున్నా ఆకు కూరలు కుళ్ళటం ఖాయం.

చేపలు వుంచాలనుకుంటే ముక్కలుచేసి బాగా కడగాలి. చేప పొట్టలోని, తల భాగంలోని రక్తంకానీ, మెత్తని అంశంకానీ ఉండకూడదు. శుభ్రంగా తీసేయ్యాలి. ఉప్పులో బాగా కలపాలి. ఉప్పు తగిలిన చేప తొందరగా పాడుకాదు. తింటానికి బాగుంటుంది. అవసరాన్నిబట్టి వేరువేరు ప్యాకెట్లలో వుంచాలి. అంతా ఒకే ప్యాకెట్లో వుంచి రోజూ తీస్తూంటే రుచి తగ్గిపోతుంది. చిన్నచిన్న ప్యాకెట్లలో వుంచి డీప్ ఫ్రిజ్‌లో పెడితే వారమంతా నిశ్చింతగా వుండొచ్చు.

మాంసం కూడా ఫ్రిజ్‌లో వుంచుకోవచ్చు. ముందు మాంసం శుభ్రంగా కడగాలి. తర్వాత అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి నూరి కొంచెం ఆవ నూనె మాంసంలో కలపాలి. ప్రెషర్‌కుక్కర్‌లో వుంచి వేడిచేయాలి. స్టీమ్ బాగాపట్టిన తరువాత దింపి చల్లార్చాలి. మూతవున్న గిన్నెలో నో డబ్బాలో నో పెట్టి డీప్‌ఫ్రిజ్‌లో వుంచాలి. వారం రోజుల తర్వాత వండినా మాంసం పాడుకాదు. పైగా మసాలాతో వుండటంవల్ల రుచిగావుంటుంది. వండటానికి టైం తక్కువపడుతుంది.

చివరిగా మరో విషయం- టెంపరేచర్ కంట్రోల్ నాబ్ 5 కంటే ఎక్కువలో ఉండాలి- వేసవికాలంలో తప్పకుండా ఉండాలి.

—అపరాజిత